సాక్షి నల్లగొండ

శనివారం । 18 । మే । 2024



'అధిక వడ్డీ' నిందితులపై ఆరా

అమాయక ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. - 8లో



పశువుల అక్రమ రవాణా

పశువులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని హాలియాలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. - 10లో

గరిష్టం / కనిష్టం

35° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలబుల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 2024 – 25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి (డేస్కాలర్), 5వ తరగతి (రెసిడెన్షియల్)లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు గ్రామీణ ప్రాంతాల వారైతే సంవత్సర ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ వాసులైతే రూ.2 లక్షల ఆదాయం కలిగి ఉండొచ్చని, ఏప్రిల్ 1వ తేదీ తర్వాత మీసేవ కేంద్రం ద్వారా ఆదాయ ధ్రువీకరణ పత్రం పొంది ఉండాలని సూచించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో జూన్ 6వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సాయంత్రం ఐదు గంటలలోగా సమర్పించాలని పేర్కొన్నారు. గతంలో ఎవరైనా కుటుంబ సభ్యులు బెస్ట్ అవైలబుల్ స్కీం, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివితే ప్రస్తుతం ఈ పథకం వారికి వర్తించదని తెలిపారు. జూన్ 11వ తేదీన ఉదయాదిత్య భవన్‌లో డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

నిబంధనలు పాటించాలి



తనిఖీలు చేస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మర్రిగూడ : ఎరువుల దుకాణదారులు, రైతు సేవా సహకార సంఘం నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని శివన్నగూడ, లెంకలపల్లి, మర్రిగూడలోని ఎరువుల దుకాణాలు, మన గ్రోమోర్ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రైతు సేవా సహకార సంఘంలో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ విత్తనాలు 30 కేజీలకు రూ.1116, జనుము 40కేజీలకు రూ.1448 ధరకు లభిస్తున్నాయని తెలిపారు. పత్తి, వరి విత్తనాలను లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన వాటికి బిల్లులు తీసుకోవాలని, విత్తనాలను విత్తిన తరువాత ఖాళీ ప్యాకెట్లను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు.

23న స్పాట్ అడ్మిషన్లు

పెద్దవూర : ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(సీఓఈ) అవంతీపురం, మిర్యాలగూడలో ప్రవేశాలకు ఈ నెల 23వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పెద్దవూర టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి శుక్రవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు సాధించిన జీపీఏ ప్రాతిపదికన అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతోపాటు రెండు సెట్ల జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని సూచించారు. ఈ నెల 25వ తేదీన బాలికలకు కూడా ఇదే కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : కాన్పూర్, బెంగుళూరులో భారత వాయు సైన్యం నిర్వహిస్తున్న అఖిల భారత అగ్నివీర్ వాయు (మ్యూజీషియన్) నియామక ర్యాలీకి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి జూన్ 5 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి ఎస్.పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి 2, 2007 జూలై 2వ తేదీన మధ్య జన్మించిన అవివాహిత యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తాత్కాలిక అడ్మిట్ కార్డ్‌తో రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీ, సమయం తాత్కాలిక అడ్మిట్ కార్డ్‌లో పేర్కొంటారని తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

సూర్యాపేట టౌన్ : సూర్యాపేటలోని కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఈ నెల 19న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ –7, 13, 17 విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎల్.సతీష్‌కుమార్ సెల్ 8555008996, 9394753343 నంబర్లను సంప్రదించాలని కోరారు.

65 - నేషనల్ హైవేపై

ప్రమాదాలకు చెక్!

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్ వద్ద వీయూపీ పనులు

- సర్వీసు రోడ్లు, జంక్షన్ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష



చిట్యాలలో ప్రమాదకరంగా మారిన భువనగిరి జంక్షన్ ప్రాంతం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : హైదరాబాద్ – విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ రహదారిపై గతంలోనే గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్‌లో ప్రమాదాల నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆంథోల్ మైసమ్మ గుడి సమీపం నుంచి కృష్ణా జిల్లా ప్రారంభం వరకు గుర్తించిన బ్లాక్ స్పాట్స్‌లో ప్రమాదాల నివారణకు సర్వీసు రోడ్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ ఇదివరకే రూ.326 కోట్లు కేటాయించింది. వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే ఆయా పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతోంది. ఎన్‌హెచ్ఏఐ చేపట్టే పనులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి కోమటిరెడ్డి

జాతీయ రహదారి విస్తరణ, రోడ్డు ప్రమాదాల నివారణపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలోనే ప్రత్యేక దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల వరకు భువనగిరి ఎంపీగా ఉన్న ఆయన కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి ఎన్‌హెచ్–65 ఆరు లేన్లుగా విస్తరణ, అభివృద్ధి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. పట్టుబట్టి నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రిగా కూడా ఆయనే ఉండటంతో దీనిపై మరింత ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లా పరిధిలో జాతీయ రహదారి వెంట జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో జిల్లా ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే బ్లాక్ స్పాట్స్‌లో పనులను ప్రారంభించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై మంత్రి వెంకట్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర రహదారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్షించారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేలా..

ఉమ్మడి జిల్లాలోని చౌటుప్పల్, పెదకాపర్తి, చిట్యాల, కట్టంగూర్, ఇనుపాముల, టేకుమట్ల, ఎస్వీ కాలేజ్ జనగాం క్రాస్ రోడ్, ఈనాడు జంక్షన్, దురాజ్‌పల్లి, ముకుందాపురం, ఆకుపాముల, కొమరబండ క్రాస్ రోడ్, కట్టకొమ్ముగూడెం, మేళ్లచెరువు, శ్రీరంగాపురం, రామాపురం క్రాస్‌రోడ్డు, నవాబ్‌పేట్ జంక్షన్‌ను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో జాతీయ రహదారికి రెండు వైపులా సర్వీసు రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి, వెహికిల్ అండర్ పాస్ (వీయూపీ) బ్రిడ్జిల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని నిర్ణయించింది. పనులను యుద్ధ ప్రాతిదికన చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే ముఖ్యంగా సైన్ బోర్డుల ఏర్పాటు, హెవీ స్పీడ్ నిర్మూలన, అవసరమైన చోట్ల ఆరు లేన్లుగా రోడ్డు విస్తరణ వంటి పనులను కూడా చేపట్టాలని ఆదేశించారు.

మరమ్మతులు చేయాల్సి వస్తే ప్రత్యామ్నాయ రోడ్లు



నకిరేకల్ వద్ద పద్మానగర్ జంక్షన్

జాతీయ రహదారిపై ఉన్న ఆయా బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతులు చేయాల్సి వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులకు సూచించారు. పనులను చేపట్టేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు సదుపాయం కల్పించి ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో పనుల విషయంలో లోటుపాట్లు ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన పనులు ఉన్నా స్పెషల్ సెక్రటరీ అనుమతి తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. మనుషుల ప్రాణాలు పోతుంటే.. అనుమతుల పేరిట ఆలస్యం చేయొద్దని స్పష్టం చేశారు.

వర్షం.. రైతుల హర్షం

- 25.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు



నల్లగొండలో కురుస్తున్న వర్షం

నల్లగొండ అగ్రికల్చర్ : ఉపరితలద్రోణి కారణంగా గురువారం రాత్రి జిల్లా అంతటా వర్షం కురిసింది. పదిహేను రోజులుగా ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన జిల్లా ప్రజలు వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఊరట చెందుతున్నారు. రోహిణి కార్తే రాకముందే వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు రోజులు క్రితం కురిసిన వర్షాలకు రైతులు దుక్కుల దున్నకం, ఎరువులు తోలుకోవడం వంటి పనులు ప్రారంభించారు. గురువారం కురిసిన వర్షానికి భూమి మంచి పదును కావడంతో రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు. జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు సగటున 25.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా కనగల్ మండంలో 108.9 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గుండ్లపల్లి మండలంలో 1.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వర్షపాతం వివరాలు ఇలా.. (మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
						అడవిదేవులపల్లి	14.7
కేతేపల్లి	76.8	కట్టంగూరు	13.6	అనుముల	18.0	తిరుమలగిరిసాగర్	4.4
చిట్యాల	61.2	శాలిగౌరారం	23.2	నిడమనూరు	11.0	పెద్దవూర	21.4
గుర్రంపోడు	59.8	నకిరేకల్	22.2	త్రిపురారం	13.0	పెద్దఅడిశర్లపల్లి	28.2
నాంపల్లి	46.8	నల్లగొండ	31.2	మాడుగులపల్లి	6.4	కొండమల్లేపల్లి	32.9
తిప్పర్తి	41.4	మునుగోడు	30.1	వేములపల్లి	4.1	దేవరకొండ	19.0
చండూరు	35.2	మర్రిగూడ	9.2	మిర్యాలగూడ	3.0	చందంపేట	3.8
నార్కట్‌పల్లి	26.0	చింతపల్లి	17.8	దామరచర్ల	11.3	గట్టుప్పల్	7.5

సేంద్రియ సాగుతో ప్రయోజనాలు

చౌటుప్పల్ : సేంద్రియ సాగు ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని, ఈ విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని భారత సహకార సేవా ఫోరం (బీఎస్ఎస్ఎఫ్) వ్యవసాయ రంగ నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ పురుషోత్తం శర్మ సూచించారు. చౌటుప్పల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయంలో రైతులను చైతన్యం చేయడంతో పాటు సేంద్రియ సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తమ సంస్థ సంకల్పించిందన్నారు. రైతులను సాగులో ప్రోత్సహించి ఆత్మహత్యలను నివారించాల్సి ఉందన్నారు. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్, వలిగొండ, మునుగోడు, సంస్థాన్‌నారాయణపురం, గుర్రంపోడు మండలాలను తమ సంస్థ దత్తత తీసుకుంటుందన్నారు. ఆయా మండలాల్లో సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన బీజీ–ఐఐ పత్తి విత్తనాలతో పాటు సేంద్రియ ఎరువులను 10శాతం రాయితీపై అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు ఈనెల 19న చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లింగారెడ్డిగూడెంలోని జీఎన్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రైతులకు అవగాన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట సంస్థ ప్రతినిధులు బొబ్బిళ్ల మురళి, అన్నంబొట్ల పవన్, దడిగం రాంసుధాకర్, తదితరులు ఉన్నారు.

హరితహారానికి సన్నద్ధం



దామరచర్ల మండలంలోని ఓ నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- 10వ విడతలో 42.20లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- 844 నర్సరీల్లో మొక్కల పెంపకం

దేవరకొండ : పదో విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతన్నారు. గాను ఆయా శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఆ ప్రకారం మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 42.20లక్షల మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు గాను జిల్లా వ్యాప్తంగా 844 నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత అనుభవాలను స్ఫూర్తిగా తీసుకొని ఈ ఏడాది 72 రకాల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటిలో పలు రకాల పూల మొక్కలతో పాటు పండ్ల, నీడనిచ్చే మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం

హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు గాను జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండవేడిమి నుంచి సంరక్షించేందుకు గాను ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సరీలకు షేడ్ నెట్స్ ఏర్పాటు చేయడంతో పాటు రోజూ రెండు సార్లు నీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది అన్ని నర్సరీలు డీఆర్‌డీఓ, అటవీశాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు ఆయా నర్సరీలను పరిశీలించి క్షేత్రస్థాయిలో అధికారులకు తగు సూచనలిస్తున్నారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను బతికించేందుకు సమష్టి కృషి చేస్తున్నారు.

ప్రతి మొక్కనూ సంరక్షిస్తాం



హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించాం. జిల్లా వ్యాప్తంగా 844 నర్సరీల్లో 42.20లక్షలు మొక్కలు పెంచుతున్నాం. హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటనున్న ప్రతి మొక్కనూ సంరక్షించేందుకు గాను ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో హరితహారం లక్ష్య సాధనకు కృషి చేస్తాం.

– నాగిరెడ్డి, డీఆర్‌డీఓ, నల్లగొండ

అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం

- కలెక్టర్ హరిచందన



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ హరిచందన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ హరిచందన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో పనులు చేపట్టడం వల్ల స్కూళ్లలో ఎంతో పురోగతి కనిపిస్తోందని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఈఓ భిక్షపతి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, డీసీఓ కరుణాకర్, డీఏఓ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్ఠింపజేసి ఊంజలి సేవ నిర్వహించారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాధస్వరాన్ని వినిపించారు. అనంతరం హారతినిచ్చారు. ఇక ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ఆరాధనలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయముఖ మండపం, ప్రాకార మండపాల్లో శ్రీసుదర్శన హోమం, నిత్య కల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ రాజ్యలక్ష్మి

నల్లగొండ : ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) డి.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై శుక్రవారం ఆమె తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు జరగనున్నాయని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షల సందర్భంగా విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులను, గట్టి బందోబస్తుతో పాటు, 144 సెక్షన్ విధించాలని పోలీస్ అధికారులను, జవాబు పత్రాలను డీఆర్‌సీ కేంద్రానికి పంపించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని పోస్టల్ అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా ఉత్తర్వులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎంలను ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో డీఐఈఓ ఆర్.దస్రూ, ఏఎస్పీ రాములునాయక్, ట్రాన్స్‌కో డీఈ సుధీర్‌కుమార్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం మాధవి పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న మెడికల్ కళాశాల



మెడికల్ కళాశాల భవన సమూదాయం

- రూ.వంద కోట్లతో కళాశాల, హాస్టల్స్, ప్రిన్సిపాల్ క్వార్టర్స్ నిర్మాణం
- 85 శాతం పూర్తయిన పనులు
- త్వరలో అందుబాటులోకి రానున్న నూతన భవనం

నల్లగొండ టౌన్ : నల్లగొండ మెడికల్ కళాశాల భవనాల సమూదాయం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీలో 42 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న కళాశాల త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం కళాశాల భవన సమదాయం నిర్మాణాలు 85 శాతంవరకు పూర్తి కావచ్చాయి. చుట్టూ 42 ఎకరాల విస్తీర్ణంలో ప్రహరిగోడ నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఆవరణలో పూలచెట్లు, గ్రీనరీ, శానిటేషన్, పార్కింగ్ షెడ్ల నిర్మాణం పనులు కూడా వేగవంతంగా చేపడుతున్నారు. భవన సమూదాయాన్ని అక్టోబర్ మాసం చివరినాటికి పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం సెప్టెంబర్‌లోగా అన్ని పనులను పూర్తి చేసి అప్పగించాలన్న లక్ష్యంతో ఉన్నారు.

2019లో కళాశాల మంజూరు..

2019 విద్యా సంవత్సరంలో నల్లగొండ మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభమైనప్పటికీ సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తరగతులను నిర్వహిస్తున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో కళాశాల నిర్మాణం కోసం రూ.100 కోట్లు కేటాయించింది. దీంతో ఎస్ఎల్‌బీసీలోని 42 ఎకరాల స్థలంలో కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మెడికల్ కళాశాల భవనాన్ని జీ ప్లస్ 3గా నిర్మిస్తున్నారు. 700 మంది విద్యార్థులకు వసతి ఉండే విధంగా బాలుర హాస్టల్ భవనాన్ని జీ ప్లస్4గా, బాలికల హాస్టల్ భవనాన్ని జీ ప్లస్5గా, ప్రిన్సిపాల్ క్వార్టర్ గెస్ట్ హౌజ్ జీ ప్లస్3గా అత్యాధునిక హంగులతో నిర్మించారు. దాంతో పాటు కళాశాలకు అనుబంధంగా క్యాంటిన్ నిర్మాణం కూడా పూర్తి చేశారు. భవనాలకు రంగలను వేయడం పూర్తయింది. భవనాల లోపల ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఇంటీరియల్ డెకరేషన్ తదితర పనులను కాంట్రాక్టర్ శరవేగంగా చేయిస్తున్నారు. మెడికల్ కళాశాల భవనాల సమూదాయాన్ని అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులు కృషి చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలకు ఎక్కడా తలొగ్గకుండా నిర్మాణ పనులను పూర్తి చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

నర్సింగ్ కళాశాలకు స్థలం కేటాయింపు

నల్లగొండ మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల కూడా మంజూరైంది. మెడికల్ కళాశాలకు కేటాయించిన 42 ఎకరాల స్థలంలోనే 5 ఎకరాలను నర్సింగ్ కళాశాలకు ప్రభుత్వం కేటాయించింది. భవన నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. దీంతో నర్సింగ్ కళాశాలను ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే నర్సింగ్ కళాశాల భవనాన్ని నిర్మించడానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం (ఒకటవ వార్డు)లో శుక్రవారం విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మున్సిపల్ సిబ్బందిపై తేనెటీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. శివనేనిగూడెంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది జిట్ట మణెమ్మ, రుద్రవరం అండాలు ఆలయం సమీపంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో చెట్లపై ఉన్న తేనెటీగలు వీరిపై అకస్మాత్తుగా దాడి చేశాయి. తీవ్రంగా గాయపడడంతో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. వీరిని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, చిట్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి తదితరులు పరామర్శించారు.

వృద్ధురాలు అదృశ్యం


లక్ష్మమ్మ (ఫైల్)

భువనగిరి క్రైం: మండలంలోని బస్వాపురం గ్రామంలో వృద్ధురాలు అదృశ్యమైంది. గ్రామానికి చెందిన ఉడుత లక్ష్మమ్మ(80) ఈ నెల 16న ఉదయం 8 గంటలకు బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుమారుడు ఉడుత సత్యనారాయణ శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. వివరాలు తెలిస్తే 87125 79973, 87126 62803 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో బ్యాటరీ చోరీ


గరిడేపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాత్రి ఉపయోగంలో లేని బ్యాటరీ చోరీకి గురైనట్లు తహసీల్దార్ బండ కవిత తెలిపారు. శుక్రవారం ఉదయం కార్యాలయం అటెండర్ రోజు వారీగా డ్యూటీకి వచ్చి చూసేసరికి కార్యాలయం వెనుక గేట్ తాళం ధ్వంసం చేసి ఉండడంతో అధికారులకు సమాచారం అందించాడు. దీంతో వారు కార్యాలయానికి చేరుకుని పరిశీలించారు. ఏ ఇతర సామగ్రి చోరీకి గురికాలేదని, కార్యాలయ ఆవరణలోని జనరేటర్ పక్కన ఉపయోగంలో లేని బ్యాటరీ మాత్రమే చోరీకి గురైనట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో బాలుడికి ఆరు నెలల జైలు

రామగిరి(నల్లగొండ): బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో బాలుడికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి శిరీష శుక్రవారం తీర్పు వెలువరించారు. నల్లగొండ మండలం ఆర్జాలబావికి చెందిన బాలుడు 2020 జూలై 19న అదే కాలనీలో ఓ బాలికపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయడంతో నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ డానియల్, ఎస్సై శివకుమార్, కానిస్టేబుల్ ఎస్. సురేస్, బి.సుమన్‌లు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. లక్ష్మణ్ నాయక్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జువైనల్ కోర్టు జడ్జి శిరీష బాలుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ హైదరాబాద్ గాజులరామారం స్పెషల్ హోంకు తరలించాల్సిందిగా తీర్పు వెల్లడించారు.

'అధిక వడ్డీ' నిందితులపై పోలీసుల ఆరా

- పుడమి ప్రాజెక్ట్‌తో నష్టపోయిన వారి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు
- హైదరాబాద్‌లోనూ బాధితులు ఉండటంతో అక్కడ నమోదైన కేసులపై ఆరా
- పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకునేందుకు సన్నద్ధం



ఇక్కడి సమాచారాన్ని నిర్వాహకులకు అందిస్తున్న ఏజెంట్

మునుగోడు: పుడమి ప్రాజెక్ట్ కంపెనీ పేరుతో అమాయక ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఘటనపై పోలీసులు స్పందించి కంపెనీ నిర్వాహకులపై ఆరా తీస్తున్నారు. కంపెనీ ఎప్పుడు పెట్టారు.. ఎంత మంది వద్ద వసూలు చేశారనే విషయాలను తెలుసుకుంటున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్‌లో కూడా బాధితులు ఉండటంతో అక్కడ ఏమైనా కేసులు నమోదయ్యాయా అని ఆరా తీస్తున్నారు. పుడమి కంపెనీ మోసంపై పూర్తిస్థాయిలో విచారించి, ఎస్పీ ఆదేశాల మేరకు చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

బాధితుల ఒత్తిడి ఎక్కువ కావడంతో సమాధానం చెప్పలేక ఈడీ నోటీసుల పేరుతో అజ్ఞాతంలోకి వెళ్లిన ఆ కంపెనీ నిర్వాహకులకు ఓ ఏజెంట్ ఇక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్లు తెలిసింది. మునుగోడు మండలంలోని పలివెల గ్రామానికి చెందిన ఆ ఏజెంట్ దాదాపు 80 మందికి పైగా రూ.60 కోట్ల వరకు పెట్టుబడి పెట్టించి అతనే దాదాపు రూ.4 కోట్ల కమీషన్ పొందాడు. దీంతో అతని ద్వారా పెట్టుబడి పెట్టిన కొందరు బాధితులు అతడిని నిలదీయడంతో తనకు వచ్చిన కమీషన్ అందరికీ ఇస్తానని, మిగిలిన డబ్బులతో తనకు సంబంధం లేదని చెప్పాడు. కానీ ఇస్తానని చెప్పిన కమీషన్ కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని బాధితులు వాపోయారు. అయితే అజ్ఞాతంలోకి వెళ్లిన వారికి ఇక్కడి సమాచారాన్ని ఇతను చేరవేస్తున్నట్లు తెలిసింది. అతడిని విచారిస్తే అజ్ఞాతంలోకి వెళ్లిన వారి సమాచారం లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

ఏజెంట్లను నిలదీస్తున్న బాధితులు

పుడమి కంపెనీలో పెట్టుబడి పెట్టిన బాధితులు ఏజెంట్లను నిలదీస్తున్నట్లు తెలిసింది. ఏడాది కాలంగా తమకు డబ్బులు ఇవ్వకపోవడంతోపాటు కనీసం ప్లాట్లు కూడా ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించడం లేదని ప్రశ్నిస్తున్నారు. కానీ పెట్టుబడి పెట్టించిన ఏజెంట్లు కంపెనీ నిర్వాహకులు మోసం చేస్తారని తమకూ తెలియదని, మీతో పాటు తాము కూడా డబ్బులు పెట్టి మోసపోయామని వాపోతున్నట్లు తెలిసింది. కంపెనీ డైరెక్టర్లలో ఒకరైన పలివెల గ్రామ వ్యక్తి బయటికి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని, అప్పటి వరకు ఓపిక పట్టాలని ఏజెంట్లు అంటున్నారని పలువురు బాధితులు పేర్కొంటున్నారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

- తక్కెళ్లపాడుకు చెందిన యువకుడే కారణమని తల్లి ఆరోపణ
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ టౌన్: ఉరేసుకుని బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లిలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం అమనగల్లు గ్రామానికి చెందిన మహిళ తన భర్త కొద్దిరోజుల క్రితం మృతి చెందడంతో తన కుమార్తెతో కలిసి తన పుట్టినిల్లు అయిన మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో నివాసం ఉంటోంది. ఉపాధి హామీ కూలీతో పాటు ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె కుమార్తె నల్లగొండలోని పారామెడికల్ కళాశాలలో నర్సింగ్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కళాశాలకు సెలవులు ఇవ్వడంతో బాలిక ఇంటి వద్దే ఉంటోంది. అయితే తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన దేశబోయిన యశ్వంత్‌తో గత రెండు, మూడేళ్లుగా బాలిక చనువుగా ఉంటుంది. మూడు రోజుల క్రితం బాలిక యశ్వంత్‌ల మధ్య ఫోన్‌లో వాగ్వాదం చోటు చేసుకుంటుంది. దీంతో యశ్వంత్ ఫోన్ నంబరును బాలిక బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో యశ్వంత్ శుక్రవారం ఉట్లపల్లి గ్రామానికి చేరుకున్నాడు. వారిద్దరి మధ్య తిరిగి వాగ్వాదం నెలకొనడంతో యశ్వంత్ ఆమెను కొట్టి, ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని వెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక (17) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గుర్తించి తల్లికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఏరియా ఆసుపత్రికి వచ్చి బాలిక కుటుంబ సభ్యుల ద్వారా సంఘటనకు దారి తీసిన విషయంపై ఆరా తీశారు. అయితే తలుపులు కూడా వేసుకోకుండా ఉరి వేసుకుని ఉండటంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యశ్వంత్ కొట్టడంతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని డీఎస్పీ ఎదుట మృతురాలి తల్లి వాపోయింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఆస్పత్రికి తరలివచ్చిన బంధువులు

బాలిక ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఉట్లపల్లి గ్రామంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి బంధువులు, మాలమహానాడు నేతలు ఏరియా ఆస్పత్రికి తరలివచ్చారు. అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆటో

- పలువురికి గాయాలు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పల్టీ కొట్టిన ఆటో

మునగాల: విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొట్టింది. ఈఘటనలో ఆటోలో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మునగాల మండలంలోని తిమ్మారెడ్డిగూడెం శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మునగాల మండల కేంద్రం నుంచి గరిడేపల్లి మండలం వెలిదెండ గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డు అంచున విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయిన ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన స్తంభాన్ని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా ఈ రహదారిలో గణపవరం – తిమ్మారెడ్డిగూడెం గ్రామాల మధ్య పలు విద్యుత్ స్తంభాలు రోడ్డును ఆనుకునే ఉన్నాయని, సంబంధిత కాంట్రాక్టర్ స్తంభాలను తొలగించకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నాడని పలువురు ఆటో డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

విద్యుదాఘాతంలో ఐదు గేదెలు మృతి


కొత్తపేటలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఐదు పాడి గేదెలు మృతి చెందాయి. గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు కొత్తపేట గ్రామశివారులోని వాగు వెంట ఉన్న పంట భూముల్లో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. ఈక్రమంలో శుక్రవారం ఉదయం స్థానికురాలైన దాసరి సునీతకు చెందిన ఐదు పాడి గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లగా.. కింద పడి ఉన్న విద్యుత్ తీగలు గేదెల కాళ్లకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ. 2లక్షలకు పైగానే ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

సైదాపురం గ్రామంలో 6 గొర్రెలు మృత్యువాత

యాదగిరిగుట్ట: మండలంలోని సైదాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఆరు గొర్రెలు మృతి చెందాయి. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండా శంకరయ్య తన గొర్రెలను మేపుతుండగా సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు 6 గొర్రెలు తగిలాయి. దీంతో ఆ గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.80వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, ఉప సర్పంచ్ దుంబాల సురేఖ వెంకట్‌రెడ్డి, నాయకులు శిఖ ఉపేందర్, పెద్ద కుర్మ నంద వెంకటేష్ కోరారు.

పోలీసులమని బెదిరించి నగదు చోరీ

కోదాడరూరల్ : తాము పోలీసులమని బెదిరించి ఓ వ్యక్తి వద్ద నగదు చోరీ చేసిన ఇద్దరి యువకులను కోదాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఇస్మాయిల్ ఈ నెల 16న రాత్రి ఏడు గంటల సమయంలో కోదాడ నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలోని దోరకుంట శివారు వద్ద నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన వినయ్, కోదాడ పట్టణ పరిధిలోని సాలార్జంగ్‌పేటకు చెందిన మతిన్‌లు ఇస్మాయిల్ బైక్‌ను అడ్డగించారు. తాము పోలీసులమంటూ బెదిరించి అతని వద్ద రూ.4500 నగదును అపహరించారు. మరుసటి రోజు మళ్లీ ఫోన్ చేసి ఇంకా డబ్బు కావాలని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఇద్దరిపై అనుమానం వచ్చిన ఇస్మాయిల్ కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్ఐ అనిల్‌రెడ్డి విచారణ చేసి నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా.. నిందితులిద్దరూ గతంలో గంజాయి కేసులో జైలుకు కూడా వెళ్లారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిలుకూరు: మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురభి రాంబాబు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన నారసాని నరసింహారావు రేషన్ లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి గ్రామంలో ఓ చోట డంపు చేసినట్లుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేశామని పేర్కొన్నారు. ఈమేరకు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నరసింహారావుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాము కాటుతో మాజీ వార్డు మెంబర్ మృతి


రాజు (ఫైల్)

నార్కట్‌పల్లి: పాము కాటుతో నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఆరవ వార్డు మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు చేపూరి రాజు (34) మృతి చెందాడు. శుక్రవారం తన కూరగాయల తోటలో గడ్డి తీస్తుండగా.. పాము కాటుకు గురయ్యాడు. సమీపంలో ఉన్న వారు గమనించి అతడిని చికిత్స నిమిత్తం స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కోదాడరూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కోదాడ పట్టణంలోని రంగని గుడి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. అనంతగిరికి చెందిన నాగరాజు, కోదాడకు చెందిన సతీష్ ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అసభ్యకర ప్రచారంపై ఫిర్యాదు

భువనగిరి క్రైం: సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం నిర్వహించడంపై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ శుక్రవారం భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

రామగిరి(నల్లగొండ): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ అయిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీసు స్టేషన్ పరిధిలోని పెద్ద సూరారం గ్రామ శివారులో వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఈ నెల 15 బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 100 లీటర్ల ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. విద్యుత్ ఏఈ రమ్య శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సింగం రామ్మూర్తి కేసు నమోదు చేశారు.

నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొన్న బైక్

- ఇద్దరు యువకులు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


ప్రమాద స్థలిలో క్షతగాత్రులు

చిట్యాల: చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో శుక్రవారం జాతీయ రహదారిపై నిలిచి ఉన్న డీసీఎంను బైక్ వెనక నుంచి ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. చిట్యాల- 2 ఎస్ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేంద్రకుమార్, పంకజ్, ప్రమోద్‌లు ఉషా లేబర్ కాంట్రాక్టర్ వద్ద కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు శుక్రవారం వెలిమినేడు గ్రామం నుంచి విధులు నిర్వహిస్తున్న చౌటుప్పల్ పరిధిలోని ఓ ఫార్మా పరిశ్రమ వద్దకు వెళ్లేందుకుగాను ఒకే బైక్‌పై బయలు దేరారు. వెలిమినేడు పరిధిలోని సుర్కంటిగూడెం క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే హైవేపై నిలిపి ఉంచిన డీసీఎం వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న సురేంద్రకుమార్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ పంకజ్, ప్రమోద్‌లను వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రమోద్(20) మృతి చెందాడు. మృతదేహాలకు నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సైదాబాబు, లింగయ్య పరిశీలించారు. మృతుడు సురేంద్రకుమార్ తమ్ముడు సంత్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


శివపార్వతి (ఫైల్)

మాడుగులపల్లి : సంతానం కలగడం లేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మాడుగులపల్లి మండలం పాములపహాడ్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపహాడ్ గ్రామానికి చెందిన సకినాల కరుణాకర్‌కు సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుండెబోయినగూడెం గ్రామానికి చెందిన శివపార్వతి (30)కి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడంతో తీవ్ర మనోవేదనకు లోనైన శివపార్వతి గత నెల 26న భర్త ఇంట్లో లేని సమయంలో పురుగుల మందు తాగింది. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఈ నెల 16న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పంట మార్పిడితో భూసారం

- హాలియా ఇన్‌చార్జి ఏడీఏ కె. సందీప్





పెద్దవూర: రైతులు పంట మార్పిడి చేయకపోవడంతో చీడపీడల వ్యాప్తి ఎక్కువై దిగుబడి తగ్గుతోంది. ఒకే పంటను ఒకే భూమిలో ఏళ్ల తరబడి సాగు చేస్తే సమస్యలు ఎదురవుతాయి. చీడపీడల తాకిడి అధికమవుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చునని హాలియా ఇన్‌చార్జి ఏడీఏ కె. సందీప్ సూచిస్తున్నారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు దిగుబడి పెరగడంతో పాటు భూమిలో సారం పెరుగుతుందని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడికి సంబంధించి సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

- నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడపీడలు దూరమవుతాయి.
- ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర వ్యాధులను దూరం చేయవచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చేసుకోవచ్చు.
- పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది.

పంటమార్పిడిలో తీసుకోవాల్సిన మెలకువలు..

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బొబ్బెర, పెసర, మినుము వంటి పంటలను వేసుకోవడం వలన నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివలన కలుపు మొక్కలను నివారించవచ్చు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరకు వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- పత్తి సాగు చేసిన నేలలో మినుము, పెసర వంటివి వేయడం వలన తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలి. దీనివలన వెరుశనగ పంటను ఆశించే ఆకుముడత ఉధృతిని తగ్గించవచ్చును.
- పసుపు తర్వాత వరి, జొన్న వంటి పంటలను సాగు చేసుకోవాలి. దీనివలన నేలలో నెమటోడ్ల సంఖ్య తగ్గుతుంది.
- నులిపురుగుల సమస్య అధికంగా ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, పొగాకు, వంగ పంటలను కొంత కాలం పాటు తప్పనిసరిగా ఆపాలి.

రైతులు పాటించాల్సినవి

- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంటను వేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.
- వర్షాకాలం రోజులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ పంటకాలం కలిగిన కంది, నువ్వులు, వేరుశనగ వంటి పంటలను వేసుకోవాలి.
- బంకమన్ను శాతం ఎక్కువగా ఉంటే ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసే ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

ఇలా చేసుకోవచ్చు..

యాసంగిలో వేరుశనగ సాగు చేసిన రైతులు తర్వాత వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చును. కంది, శనగ పంటలను వరుసగా వేస్తే కాయతొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్టవరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి. వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశనగ పంటకు నులిపురుగుల బెడద తగ్గుతుంది. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాల పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పంటలను లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు. వంగ తోట వేసిన రైతులు కాలీఫ్లవర్‌తో పంట మార్పిడి చేసుకుంటే వంగకు ఎండు తెగులు సోకదు. టమాట, ఆవాలు, బంతి ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులి పురుగుల ఉధతి తగ్గుతుంది.

ఇలా చేయవద్దు..

పంట మార్పిడి చేసే సమయాలలో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలి. లేదంటే చీడపీడల ఉధృతి ఎక్కువ అవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాటా, క్యాబేజీ, దోస, గుమ్మడి, సోర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకుముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయాచిక్కుడు వేయకూడదు.

ధాన్యపు పంటలతో..

దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లిసాగు చేసే రైతులు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. ఒకసారి పసుపు సాగు చేసిన వారు రెండేళ్ల పాటు భూమిలో పసుపు సాగు చేయకూడదు. ఒకవేళ చేస్తే దిగుబడి తగ్గుతుంది. చీడపీడల బెడద పెరుగుతుంది. వరి, చెరుకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజీ పంటలను ఆశించే లద్దె పురుగుల తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో మార్పిడి చేయాలి.

ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి

పంట మార్పిడి చేయాలంటే అంతకుముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటను ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తూ ఉంటాయి. కాబట్టి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటలకు బదులుగా భూమికి పోషకాలను గ్రహించి సమకూర్చే అపరాల పంటలతో పంట మార్పిడి చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రీయ పదార్థాన్ని అందిస్తాయి. అపరాల పంటల మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మ జీవుల చర్య వల్ల ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్లరేగడి నేలల్లో సోయ చిక్కుడు వేసుకుంటే పంట కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రీయ పదార్థం లభిస్తుంది.